సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 28 । సెప్టెంబర్ । 2025



రూ.1.70 లక్షల విరాళం


తొండంగి: రత్నగిరిపై సత్యదేవుని నిత్యాన్నదాన ట్రస్టుకు బాదం చక్రవర్తి, సీతామహాలక్ష్మి దంపతులు (కోరుకొండ మండలం గాదరాడ) శనివారం రూ.1.70 లక్షల విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి రూ.59 వేలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాయపురెడ్డి అఖిల్ సాయి శ్రీరామ్ (అమలాపురం) శనివారం రూ.59 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: ఖరీఫ్ సాగు అవసరాల నిమిత్తం కాటన్ బ్యారేజీ నుంచి శనివారం గోదావరి డెల్టాలకు 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,900, సెంట్రల్ డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్యేలకి బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలి

బాలకృష్ణ వ్యాఖ్యలపై పితాని ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న పితాని బాలకృష్ణ తదితరులు

ముమ్మిడివరం: దేవాలయం లాంటి శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్య సమాజం సిగ్గుపడేలా ఉన్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బాలకృష్ణ మద్యం తాగి అసెంబ్లీకి వచ్చారా అనే సందేహం ప్రజలకు కలుగుతోందని అన్నారు. ఎందుకంటే ఆయన హావభావాలు, బాడీ లాంగ్వేజ్ చూసిన వారికెవరికైనా ఇటువంటి సందేహం కలుగుతుందన్నారు. ఇకపై అసెంబ్లీకి వచ్చే శాసన సభ్యులకు బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు చేయాలని పితాని హితవు పలికారు. ప్రముఖ సినీ నటుడు చిరంజీవిని అవమానించడం అంటే అయన అభిమానులను అవమానించడమేనన్నారు. తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి, చిరంజీవి, సినీ రంగ ప్రముఖుల మధ్య జరిగిన సమావేశం ఆహ్లాదకరంగా జరిగిందని, దీనివల్ల సినిమా రంగానికి ఎంతో మేలు జరిగిందని, నిర్మాతలు, లాభపడ్డారని గుర్తు చేశారు. బాలకృష్ణ నటించిన సినిమాకి కూడా టికెట్లు పెంచుకునేందుకు తమ నాయకుడు అవకాశం కల్పించారని ఆయన గుర్తు చేశారు. తన అన్నను శాసన సభ సాక్షిగా అవమానకరంగా మాట్లాడినా పవన్ కల్యాణ్ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. జగన్‌కు బాలకృష్ణ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పెయ్యల చిట్టిబాబు, మట్టపర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకి దినుసులెలా?



అంగన్‌వాడీ ఉద్యోగుల ఆందోళన (ఫైల్)



రామచంద్రపురం ఎంఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న చిరుద్యోగులు
- రెండు నెలలుగా వేతన బకాయిలు

సాక్షి, అమలాపురం: సూపర్ సిక్స్ పేరుతో అద్భుతాలు చేస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు అన్ని వర్గాలనూ మోసం చేస్తున్నారు. ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తామని, మెరుగైన పీఆర్సీ ప్రకటించి, బకాయిలన్నీ చెల్లిస్తామని ఎన్నికల హామీలు గుప్పించారు. పాలనా పగ్గాలు చేపట్టి 16 నెలలు కావస్తున్నా అవేమీ చేయకపోగా చిరుద్యోగులను మరీ దారిద్ర్యంలోకి నెట్టేశారు. నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో దసరా పండగ నాడు కూడా వారు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది.

అంగన్‌వాడీ, ఆయాలకు రెండు నెలలుగా..

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు రెండు నెలలుగా వేతనాలు బకాయి పెట్టారు. కార్యకర్తకు నెలకు రూ.11,500, ఆయాకు రూ.7వేలు గౌరవ వేతనంగా అందజేస్తారు. ఆ చిన్న మొత్తాన్ని సైతం జూలై, ఆగస్టు నెలలకు ఇవ్వలేదు. ఇంకో నాలుగు రోజులు గడిస్తే మూడో నెలా బకాయి పెట్టినట్టు అవుతుంది. జిల్లాలో 1,726 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 1,637 మందికి కార్యకర్తలకు నెలకు రూ.1,88,25,500 చొప్పున, ఆయాలకు నెలకు రూ.1,14,59,000 చొప్పున మొత్తం రూ.3,02,84,500 గౌరవ వేతనం చెల్లించాల్సి ఉంది. రెండు నెలలకు కలిపి రూ.6,05,69,000 ప్రభుత్వం బకాయి పెట్టింది.

సమగ్ర శిక్ష సిబ్బందికి..

విద్యా శాఖలో సమగ్ర శిక్ష అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆగస్టు నెల గౌరవ వేతనం సెప్టెంబరు నెల ముగుస్తున్నా నేటి వరకు ఇవ్వలేదు. మరో నాలుగు రోజులు గడిస్తే రెండు నెలల వేతనాలు బకాయి పడతాయి. సమగ్ర శిక్షా పరిధిలో 22 మండలాల్లో వివిధ విభాగాల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సీఆర్‌ఎంటీలు 117, పీటీఐలు 250, ఆఫీస్ సిబ్బంది 80, ఐఈఆర్‌పీలు 44, ఏపీసీవోఎస్‌లు 30, సైట్ ఇంజినీర్లు ఐదుగురు చొప్పున ఉన్నారు. సీఆర్‌ఎంటీకి నెలకు రూ.23,500 గౌరవ వేతనం చెల్లిస్తుండగా, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు రూ.17,500 చెల్లిస్తున్నారు. పండగ దగ్గర చేసైనా చెల్లిస్తారా అని వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

పండుగ పూటా పస్తులేనా

దసరా సరదా మాట దేవుడెరుగు. పూట గడవడమెలా అనే పరిస్థితి వారిది. నెల జీతం రాకపోతే ఇంటి ఖర్చులు, వైద్య ఖర్చులు తదితర చెల్లింపులు చేసుకోవాల్సి ఉంటుంది. అసలే అరకొర వేతనాలతో జీవితాలను నెట్టుకొస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు నెలవారీగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు.

ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అసలే అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. వేతనాలు సక్రమంగా అందకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకోవలసి వస్తోంది. ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి.

– కె.కృష్ణవేణి, జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ఇబ్బంది పడుతున్నాం



దసరా పండుగ వచ్చేసింది. వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణకు రోజు వారీ ఖర్చులు, ఇతర అవసరాలకు అప్పులు చేయాల్సి వస్తోంది. దసరా పండగకైనా వేతనాలు చెల్లించాలి.

– సీహెచ్ వెంకన్నబాబు, జిల్లా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్

ఊరేగింపులకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ రాహుల్ మీనా



అమలాపురం టౌన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరగనున్న దసరా ఉత్సవాల ఊరేగింపులకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. జిల్లా ప్రజలు దసరా ఉత్సవాలను స్నేహ పూర్వక వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఆయన తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్నీ సక్రమంగా జరిగేలా ఉత్సవ కమిటీ ప్రతినిధులే బాధ్యత తీసుకోవాలని ఆయన అన్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలో ఎవరైనా ఊళ్లకు వెళుతుంటే పోలీస్ శాఖను సంప్రదించి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్) ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పోలీసులకు రిక్వెస్ట్ పెట్టుకుంటే సమీప పోలీసు స్టేషన్ నుంచి సిబ్బంది వచ్చి సీసీ కెమెరాలు బిగించి పోలీసు కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తుంటారని వివరించారు. తద్వారా ఇళ్లలో దొంగతనాలు నివారించవచ్చని అన్నారు.

హోం స్టే టూరిజంతో ఉపాధి మెరుగు

- కలెక్టర్ మహేశ్‌కుమార్



మండువా ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మలికిపురం: టూరిజంలో హోమ్ స్టే విధానాన్ని అమలు చేయడం ద్వారా గ్రామీణులకు కొత్త ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.మహేశ్ కుమార్ పేర్కొన్నారు. తూర్పుపాలెంలో ఎంపిక చేసిన అడబాల వీరన్న మండువా ఇంటిని శనివారం ఆయన పరిశీలించి ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వారా వెబ్‌సైట్‌కు అనుసంధానించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ హోమ్ స్టే టూరిజం అభివృద్ధికి తొలి విడతగా రాష్ట్రంలో ఎంపిక చేసిన నాలుగు కేంద్రాలలో కోనసీమ జిల్లా ఒకటన్నారు. ఈ మేరకు జిల్లాలో 145 మండువా ఇళ్లను గుర్తించి రాష్ట్ర టూరిజం వెబ్‌సైట్‌లో పెట్టామని, టూరిస్టులు వాటిని చూసి ఆకర్షితులై ఆనాటి వాతావరణాన్ని అనుభూతి చెందే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా ఇక్కడి ప్రజలకు ఆదాయం, ఉపాధి లభిస్తాయన్నారు. ఈ ప్రాంత సంస్కృతి, జీవనశైలిని అనుభూతి చెందే దిశగా ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రోత్సహిస్తోందన్నారు.

ఏ కాటు రేబిస్ కానుందో!

తన చూపులతో.. చేష్టలతో మనుషులను వశం చేసుకునే పెంపుడు జంతువులలో కుక్క ఒకటి. ఒక్కసారి దాని ప్రేమకి లొంగిపోతే పరోక్షంగా ఆ యజమాని లేదా ఆ ఇంటి వారు దానికి బానిస లైపోయినట్టే. దానిని నెత్తినెక్కించేసుకుంటారు. ఈ ప్రేమ, వశం మాటున పెద్ద ప్రమాదం పొంచి ఉందని ఆ దాని మాయలో పడినవారికీ.. ఆ మూగజీవికి సైతం తెలియదు. తెలిసినా ఎక్కువ శాతం ఆ ప్రమాదాన్ని విస్మరిస్తారు. దాని పోషణ ఎంత ముఖ్యమో.. దాని ఆరోగ్య విషయంలోనూ అంతే జాగ్రత్త తీసుకోవాలంటారు వైద్యులు. ఆ జీవి చొంగ కానీ.. కంటి నీరు కానీ ఎంతో ప్రమాదకరమైనవి. మితిమీరి ప్రేమించేవారు దాని ముక్కుమీద.. నోటి మీద ముద్దులిస్తుంటారు. అంతే కాకుండా దానికి అన్నం సైతం నోట్లో పెట్టి తినిపిస్తారు. ఈ విషయంలో అత్యంత జాగ్రత్త వ్యవహరించాల్సిన ఆవశ్యకత ఉంది. దాని నుంచి ఎటువంటి వ్యాధులు సంక్రమించకుండా.. నిర్ణీత కాల వ్యవధిలో ఏఆర్వీ ఇంజెక్షన్లు, టీకాలు, ఏ అనారోగ్యం వచ్చినా మందులు ఇప్పించాలి. లేదంటే ఆ ప్రేమ చూపించే మూగజీవే ప్రాణాంతకం కావచ్చు.

- కుక్కలతో అప్రమత్తం అంటున్న వైద్యులు
- ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 3,794 కేసులు
- నేడు వరల్డ్ రేబిస్ డే

రాయవరం: జంతువులు, మనుషుల్లోను వచ్చే అతి ప్రాణాంతక వ్యాధి రేబిస్. అత్యంత ప్రమాదకరమైన వైరల్ వ్యాధుల్లో ఇది ఒకటి. దీనినే లిస్సా హైడ్రోఫోబియా అని కూడా అంటారు. ఈ వ్యాధి సోకిన జంతువులు కరవడం వల్ల మనుషులకు కూడా ఆ వ్యాధి వ్యాపిస్తుంది. కుక్కకాటు ద్వారా సంక్రమించే అతి పురాతనమైన వ్యాధి ఇది. రేబిస్ నివారణకు ప్రయత్నాలు జరుగుతున్నా నేటికీ అదుపులోకి రాకపోగా చాలా మందిని ఇది పొట్టన పెట్టుకుంటోంది. పిచ్చి కుక్క కరవడం ద్వారా వచ్చే రేబిస్ వ్యాధికి సకాలంలో చికిత్స చేస్తే పూర్తిగా నివారించే వీలుంటుంది.

వ్యాధి లక్షణాలు రెండు రకాలు

■ ఉగ్రరూపం

ఈ దశలో జంతువు విపరీతమైన ఆందోళనగా ఉంటుంది. ప్రతి ఒక్కరినీ విచక్షణా రహితంగా కరుస్తూ యజమానిని గుర్తించలేదు. రాళ్లు, కర్రలు తదితర వాటిని తినడానికి ప్రయత్నిస్తుంది. ఆహారం తినదు. కళ్లు ఎర్రబడి వుండి నోటి నుంచి చొంగ విపరీతంగా కారుతుంది. గొంతు కండరాలకు పక్షవాతం వచ్చి గొంతు బొంగురు పోతుంది. నీరు తాగలేదు. అరుపులో మార్పు వస్తుంది. పిచ్చిగా పరుగులు తీసి గోడలను రుద్దు కుంటుంది. దవడలు బిగుసుకు పోతాయి. సాధారణంగా ఈ లక్షణం పిల్లుల్లో వస్తుంది.

ఐదేళ్ల వ్యవధిలో కుక్క కాట్లు, మరణాల సంఖ్య ఇలా

సంవత్సరం	డాగ్ బైట్స్	రేబిస్ కేసులు	రేబిస్ డెత్స్
2021	4,378	0	0
2022	5,562	0	0
2023	5,215	0	0
2024	4,559	1	1

2025 జనవరి నుంచి నేటి వరకు 3,794 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి.



ప్రమాదకరంగా వ్యవహరించే సందర్భంలో..



తన పప్పీ ప్రేమను ఆస్వాదిస్తున్న చిన్నారి

■ మూగతనం

రేబిస్ సోకిన జంతువుకి కింద దవడ వేలాడుతుంది. వ్యాధి లక్షణాలు అంతగా కనిపించవు. ముందుగా పక్షవాతం లక్షణాలు కన్పిస్తాయి. కరవలేదు. కుందేళ్లలో ఈ లక్షణం కన్పిస్తుంది.

వ్యాధి నివారణ చర్యలు

- వ్యాధికి చికిత్స లేదు. వ్యాధి నిరోధక టీకాలు (పోస్ట్ బైట్) వేయించుకోవాలి.
- రేబిస్ సోకిన కుక్క లేదా అడవి జంతువుల ద్వారా అయిన గాయాలకు వెంటనే చికిత్స చేయించాలి. యాంటీ రేబిస్ ఇమ్యునో గాబులిన్స్ ఇప్పించాలి.
- కుక్క కరిచిన గాయాలను శుభ్రంగా డిటర్జెంట్ సబ్బుతో కడగాలి.
- కార్బలిక్ యాసిడ్, టింక్చర్ అయోడిన్‌ను గాయంపై పూయాలి. యాంటీ రేబిస్ ఇమ్యునో గ్లాబ్యులిన్స్ ఇంజక్షన్ ఇవ్వాలి.
- యాంటీ రేబిస్ పోస్టుబైట్ కోర్సు 0, 3, 7, 14, 28, 90 రోజుల్లో క్రమం తప్పకుండా వ్యాక్సిన్ చేయించుకోవాలి.
- పెంపుడు కుక్కల యజమానులందరూ తప్పనిసరిగా తమ కుక్కలకు యాంటీరేబిస్ వ్యాక్సిన్ ఇప్పించేలా చట్టబద్ధం చేయాలి.
- వీధి కుక్కలకు గర్భనిరోధక ఆపరేషన్లు చేసే కార్యక్రమాలను బ్లూక్రాస్ వంటి సంస్థల సహకారంతో చేపట్టాలి.
- ఇతర దేశాలు, ప్రాంతాల నుంచి కుక్కలను తీసుకువచ్చే సమయంలో వాటికి తప్పనిసరిగా వ్యాక్సినేషన్ సర్టిఫికేట్ ఉండేలా చూడాలి.
- రేబిస్ లక్షణాలు, వ్యాప్తి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. అలాగే రేబిస్ కేసుల గురించి తప్పనిసరిగా ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- వెటర్నరీ, మెడికల్, మున్సిపల్ శాఖలు కలిసికట్టుగా రేబిస్ వ్యాధి నిరోధానికి చర్యలు చేపట్టాలి.

యాంటి రేబిస్ టీకా

పిచ్చికుక్క కరిచిన ఒక బాలుడికి 1885వ సంవత్సరంలో లూయిస్‌పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటి సారిగా యాంటి రేబిస్ టీకా వేశారు.


పెరిగిపోతున్న కుక్కల సంతతి

ఇటీవలి కాలంలో కుక్కల సంతతి బాగా పెరిగిపోవడంతో పలువురు కుక్కకాటు బారిన పడుతున్నారు. ఈ వ్యాధి వల్ల జిల్లాలో ఏటా వేల సంఖ్యలో కుక్కకాట్లకు గురవుతున్నారు. మనుషులే కాదు పశువులు కూడా కుక్క కాటు బారిన పడుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 26వ తేది వరకు 3,794 మంది కుక్కకాటు బారిన పడ్డారు. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స చేపడితే పూర్తిగా నివారించవచ్చునని వైద్యులు చెబుతున్నారు.

వ్యాధి స్వరూపం ఇదీ..

రేబిస్ వ్యాధి రెబ్డో వైరస్ వల్ల వస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువు లేదా జంతువు కరవడం వల్ల ఇది వ్యాపిస్తుంది. రేబిస్ వ్యాధి ఎక్కువగా కుక్కల వలనే వస్తుంది. వాటిలో లాలాజలం కళ్లు, ముక్కు, పుండు స్రావాల్లో ఉన్న వైరస్ ఆ జంతువు కరచిన ప్రదేశం నుంచి కేంద్ర నాడీ మండలం ద్వారా మెదడుకు చేరి అక్కడ లాలాజల గ్రంధులకు చేరుతుంది. రేబిస్ వ్యాధిని పిచ్చి కుక్క వ్యాధి, హైడ్రో ఫోబియా (నీళ్లంటే భయపడడం) అని కూడా పిలుస్తారు.

వెంటనే వైద్యులను సంప్రదించాలి



కుక్క కాటుకు గురైన వ్యక్తి వెంటనే వైద్యులను సంప్రదించాలి. కుక్క కరిచిన చోట సబ్బుతో 10–15 నిమిషాలు సబ్బుతో కడగాలి. కచ్చితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయించాలి. రేబిస్ వ్యాధి నివారణ ఒక్కరి వల్ల సాధ్యం కాదు. కుక్కల సంతతిని వ్యాక్సినేషన్ ద్వారా కట్టడి చేయాలి. మీరు..నేను.. సమాజం అనే స్లోగన్‌తో రేబిస్ నివారణ దినోత్సవాన్ని ఈ ఏడాది నిర్వహిస్తున్నారు.

– డాక్టర్ ఆర్‌వీ ప్రతాప్, జిల్లా సర్వైలెన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

క్లుప్తంగా

ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య దూరం



కలెక్టర్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు గోవిందరావు

అమలాపురం రూరల్: పీపీపీ మోడల్‌లో టీడీపీ పారిశ్రామిక వేత్తలు, తన తాబేదార్లకూ సీఎం చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కళాశాలను అప్పగించడం వల్ల పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తుందని జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది టీవీ గోవిందరావు కలెక్టర్ మహేష్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రూ.8 వేల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను ఏడాదికి కేవలం రూ.5 వేలకే ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి తొలి విడతలో నాలుగు కాలేజీలను పీపీపీ పద్ధతిలో అప్పగించేందుకు టెండర్ నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పులివెందుల కాలేజీలను అప్పగించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని అన్నారు. మెడికల్ కాలేజీలు, 625 పడకల సూపర్ స్పెషలిటీ ఆస్పత్రుల పీపీపీకి టెండర్లను పిలిచిందని, కమీషన్ల కోసం మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారన్నారని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. 2019–24 కాలంలో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి అప్పటి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే శ్రీకారం చుట్టారని అన్నారు.

పోటెత్తిన వరద

- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద తొలి ప్రమాద హెచ్చరిక

ఐ.పోలవరం/పి.గన్నవరం: గోదావరికి మరోసారి వరద పోటెత్తింది. ఉదయం తొమ్మిది గంటల నుంచి గంటగంటకూ వరద పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మరోసారి తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. పెరిగిన వరద కోనసీమ జిల్లాలో లంక వాసులను ఆందోళనకు గురి చేస్తోంది. గోదావరిలో సెప్టెంబరు నెలలో వరద రావడం అరుదు. అటువంటిది ఈ నెలలో ఇప్పటి వరకు మూడుసార్లు వరద తాకింది. కేవలం గంటల వ్యవధిలోనే భారీ వరద చోట చేసుకుంది. గోదావరి క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాల వల్ల దిగువకు వరద పోటెత్తుతోంది. బ్యారేజ్ నుంచి శనివారం ఉదయం 6 గంటలకు 6,09,607 క్యూసెక్కుల విడుదలైన వరద నీరు సాయంత్రం ఆరు గంటల సమయానికి 10 లక్షల క్యూసెక్కులకు పెరగడం విశేషం. కేవలం 13 గంటల వ్యవధిలో నాలుగు లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి ఏడు గంటల సమయానికి ఇది 10.14 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. ఈ స్థాయిలో వరద పెరుగుదల ఇటీవల కాలంలో ఎప్పుడూ చోటు చేసుకోలేదు.

పి.గన్నవరంలో ఇప్పటికే నాలుగు లంక గ్రామాలకు గత జూలై నుంచి రాకపోకలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. గంటి పెదపూడిలంక, అరిగెలవారిపేట, ఊడిమూడిలంక, బూరుగులంక వాసులు మూడు నెలలుగా పడవల మీదనే రాకపోకలు సాగిస్తున్నారు. తాజా వరదతో ఇక్కడ ఉధృతి మరింత పెరిగింది. ఈ మండలాన్ని ఆనుకుని పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే కనకాయిలంక కాజ్‌వే నీట మునిగింది. దీనితో రాకపోకలు నిలిచిపోయాయి. మామిడికుదురు మండలం అప్పనపల్లి, అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వేలు ఆదివారం నీట మునిగే అవకాశముంది. ఐ.పోలవరం మండలం రాఘవేంద్ర వారధి వద్ద మత్స్యకార ఇళ్లను తాకుతూ వరద నీరు ప్రవహిస్తోంది. అన్నంపల్లి అక్విడెక్టు, ఎదుర్లంక వారధుల వద్ద వరద సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేల్లంక, గురజాపులంక, కమిని, అల్లవరం మండలం బోడసుకుర్రు పల్లిపాలెం మత్స్యకార కాలనీతో పాటు కాట్రేనికోన మండలం పల్లంకుర్రు, బలుసుతిప్పలలో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



ఐ.పోలవరం మండలం మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద మత్స్యకార ఇళ్లను ఆనుకుని ప్రవహిస్తున్న వరద

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

మాజీ మంత్రి గొల్లపల్లి, ఎమ్మెల్సీ కుడుపూడి

అమలాపురం రూరల్: కూటమి ప్రభుత్వం నడుపుతున్న రెడ్ బుక్ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా ఉండేందుకు డిజిటల్ బుక్‌ను ప్రారంభించారని వైఎస్సార్ సీపీ రాజోలు నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మండలం భట్నవిల్లిలో మాజీ మంత్రి విశ్వరూప్ నివాసంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతోందన్నారు. వాటి నుంచి పార్టీ శ్రేణులను కాపాడుకునేందుకు జగన్ డిజిటల్ బుక్ ప్రారంభించారన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి కార్యకర్తలు తమ ఇబ్బందులపై ఫిర్యాదు చేస్తే వారికి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. db.weysrcp.com లోకి వెళ్లి కార్యకర్త ఫోన్ నంబర్‌ను టైప్ చేయగానే ఓటీపీ వస్తుందన్నారు. తర్వాత వివరాలు పూర్తి చేసి అన్యాయానికి సంబంధించి డాక్యుమెంట్లు, వీడియోలు అప్‌లోడ్ చేస్తే డిజిటల్ బుక్‌లో స్టోర్ అవుతాయన్నారు. ఐవీఆర్ విధానం ద్వారా 040–49171718 టెలిఫోన్ నంబర్‌కు కాల్ చేసిన తర్వాత ఫిర్యాదు ఎలా చేయాలన్నదానిపై గైడెన్స్ ఇస్తూ పూర్తి చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు మాట్లాడుతూ అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకు శ్రీరామరక్షగా డిజిటల్ బుక్ నిలుస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక డిజిటల్ బుక్‌లో నమోదైన కేసులపై దర్యాప్తు చేయించి న్యాయం చేస్తామన్నారు. కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన అధికారులు రిటైర్ అయినా, ఎక్కడ ఉన్నా చట్టం ముందు నిలబెడతామని జగన్ హామీ ఇచ్చారన్నారు. పి.గన్నవరం కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 16 నెలల కాలంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారన్నారు. తొలిత డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను గొల్లపల్లి, ఎమ్మెల్సీ సూర్యానారాయరావు, పార్టీ నాయకులు అవిష్కరించారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, పితాని బాలకృష్ణ, కర్రి పాపారాయుడు, పాటి శివకుమార్, మహిళ విభాగం అధికారి ప్రతినిధి కాశి బాలమునికుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు సంసాని బులి నాని, బద్రి బాబ్జీ, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, కొనుకు గౌతమి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు బాబ్జీ, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు వెంకటేష్, మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి గొవ్వాల రాజేష్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదిటి శిరీష్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి గుత్తుల ఈశ్వర ప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శులు చింతా రామకృష్ణ, పొగాకు శ్రీను, ఒంటెద్దు వెంకన్నాయుడు, కుడుపూడి భారత్ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, పార్టీ నాయకులు

వాడపల్లి.. జనసంద్రం

- భక్తులతో పోటెత్తిన వేంకన్న క్షేత్రం
- మార్మోగిన గోవింద నామస్మరణ
- ఒక్కరోజు ఆదాయం రూ.52.36 లక్షలు

కొత్తపేట: కోనసీమ తిరుమలగా ఖ్యాతికెక్కిన వాడపల్లి క్షేత్రానికి శనివారం భక్తజనం పోటెత్తారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వరుని క్షేత్రానికి తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. శుక్రవారం రాత్రి నుంచే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి భక్తులు కాలి నడకన వాడపల్లికి చేరుకున్నారు. సాధారణ భక్తులతో పాటు అత్యధిక సంఖ్యలో 'ఏడు శనివారాలు – ఏడు ప్రదక్షిణల' నోము ఆచరిస్తున్న భక్తులతో ఆ క్షేత్రం నిండిపోయింది. పలువురు భక్తులు మోకాళ్లపై ప్రదక్షిణలు చేశారు. గోవింద నామస్మరణతో వాడపల్లి క్షేత్రం మార్మోగింది. ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితుల బృందం విశేష పూజలు చేసి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని కూడా స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో సేవలను ఈఓ పరిశీలించారు. వివిధ సేవల ద్వారా దేవస్థానానికి రూ.52.36 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈఓ చక్రధరరావు తెలిపారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఎస్సై రాము పోలీస్ సిబ్బందితో ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు.



వాడపల్లి క్షేత్రంలో ఏడు ప్రదక్షిణలు చేస్తున్న భక్తజనం



ఉచిత వైద్య శిబిరంలో భక్తుని యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఈఓ చక్రధరరావు →

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

అంబేడ్కర్ నడయాడిన ఈలి వాడపల్లి



రామచంద్రపురంలో టాప్‌లేని కారులో అంబేడ్కర్‌ను ఊరేగిస్తున్న స్థానికులు (ఫైల్)



ఈలి వాడపల్లి ఆశ్రమంలో విద్యార్థులు

నేటికి 81 ఏళ్లు పూర్తి

రామచంద్రపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రామచంద్రపురంలో పర్యటించి నేటికి 81 ఏళ్లు పూర్తయ్యింది. 1944 సెప్టెంబర్ 28న ఆయన స్థానిక ఈలి వాడపల్లి ఆశ్రమానికి వచ్చారు. తాళ్లరేవు మాజీ ఎమ్మెల్యే, దళిత నాయకుడు ఈలి వాడపల్లి 1944లో అంబేడ్కర్‌ను జిల్లా ప్రజలకు పరిచయం చేసేందుకు జాతికి నూతన చైతన్యాన్ని, స్ఫూర్తిని కలిగించేందుకు జిల్లాకు ఆహ్వానించారు. ఆ మేరకు ఆయన కాకినాడ రాగా అక్కడ ఏనుగుపై ఆయనను కూర్చుండబెట్టి వేలాది దళితులు, పుర ప్రముఖుల సమక్షంలో ఊరేగించారు. అనంతరం వాడపల్లి ఆశ్రమాన్ని సందర్శించారు. ఆయనకు కుయ్యేరు గ్రామానికి చెందిన దండంగి గంగమ్మ స్వాగతం పలికారు. రామచంద్రపురంలో వంద ఎడ్ల బండ్లను అలంకరించి గారడీలు, డప్పుల బ్యాండ్‌లు, కోలాటాలతో టాప్ లేని కారు మీద అంబేడ్కర్‌ను ఘనంగా ఊరేగింపుగా వాడపల్లి ఆశ్రమానికి వచ్చారు. అక్కడ దళిత విద్యార్థుల చదువు, పోషణ తదితర వివరాలను అడిగి తెలుసుకుని వాడపల్లిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వాడపల్లి పెద్ద కుమారునికి ప్రేమప్రసాద్ అనే నామకరణం చేశారు. అనంతరం ఢిల్లీకి తిరుగుపయనమయ్యారు.

ఆయన స్మారకంగా తపాలా కవరు

అంబేడ్కర్ రామచంద్రపురం పర్యటనను పురస్కరించుకుని తపాలా శాఖ 2021 సెప్టెంబర్‌లో ప్రత్యేక తపాలా కవర్‌ను విడుదల చేసింది. దీనిని అప్పటి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో విడుదల చేశారు.